కాలనీలకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్

జీహెచ్ఎంసీలో కార్పొరేషన్లు కల్వక ముందే లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలి

కేసీఆర్ హయాంలో అన్ని చోట్ల సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశాం

రూ.2.50 కోట్లతో లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 13: మున్సిపల్ కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో కల్వక ముందే ప్రతి బస్తీ, ప్రతి కాలనీల్లో లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని ప్రజాప్రతినిధులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సూచించారు. బడంగ్‌పేట కమాన్ నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్సీ వాణీదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాలాపూర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు సెంట్రల్ రూ.2.50 కోట్లుతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.50 లక్షలు బడంగ్‌పేట కమాన్ నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ అధికారంలో ఉన్న సమయంలో సెంట్రల్ లైటింగ్ ప్రతి చోట ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయలేక పోయామన్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. గాంధీ నగర్ చౌరస్తా వరకు ప్రస్తుతం సెంట్రల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గాంధీ నగర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. మహేశ్వరం నియోజక వర్గం వ్యాప్తంగా రూ.18 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

బడంగ్‌పేట కమాన్ నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సురభి వాణీదేవి, తదితరులు

ముంపు తలెత్తకుండా జాగ్రతలు తీసుకోవాలి

మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముంపు సమస్య తలెత్తకుండా అధికారులు తగు జాగ్రతలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.సబిత ఇంద్రారెడ్డి అన్నారు. అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముంపు సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఇప్పటికే చాలా కాలనీల నుంచి ప్రజలు ఫోన్లు చేస్తున్నారన్నారు. వరద నీరు పోవడానికి వారం పది రోజులలో నాలాలను క్లీన్ చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉండటం వలన కొన్ని పనులు చేయలేక పోతున్నామన్నారు. అన్ని ప్రాంతాలలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. కాలనీలలో ఇబ్బంది కలుగకుండా వీలైనంత తొందరలో పూర్తి చేయాలన్నారు. మంత్రాల చెరువు దగ్గర ఐఎన్‌డీ పూర్తి అయితే సమస్య ఉండదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ విధంగా అభివృద్ధి జరిగిందో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం అదే విధంగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, అర్కల భూపాల్ రెడ్డి, సిద్దాల బీరప్ప, రాంచందర్, బీమ్ రాజ్, కీసర గోవర్ధన్ రెడ్డి, కోఆప్షన్ పల్లె జంగయ్య గౌడ్ నాయకులు దిండు భూపేశ్ గౌడ్, శ్రీను నాయక్, బాల్ రాజ్, సునీత బాల్‌రాజ్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచండి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 13: ఎల్బీనగర్ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆయన తన నివాసంలో ఎస్ఎన్‌డీపీ అధికారులతో గురువారం సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కొనసాగుతన్న ఎస్ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచి త్వరగా ముగించేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ ఫేస్-2 అభివృద్ధి నిర్మాణ పనుల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో అతి తీవ్రమైన సమస్యలను గుర్తించి సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గతంలో సుమారు రూ.193 కోట్ల నిధులతో ప్రారంభించిన అభివృద్ధి పనులు ముగింపు దశలో కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే చంపాపేట డీ మార్ట్ నుంచి రెడ్డి కాలనీ మీదుగా, లింగోజిగూడ డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీ నుంచి సాగర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు, వందనపురి కాలనీ నుంచి కేకే గార్డెన్ వరకు నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇదే విధంగా వంగ శంకరమ్మ గార్డెన్ మొదలుకొని, పద్మానగర్ కాలనీ మీదుగా శ్రీనివాస కాలనీకి ఒక డ్రెయిన్ నిర్మించడం జరిగింది. చంద్ర గార్డెన్ నుంచి, సింగిరెడ్డి శివారెడ్డి గార్డెన్ వెనక పనులు కొంతమేర ఆలస్యంగా కొనసాగుతుండటం మూలంగా ఇటీవల కొంత చెదురు మదురుగా కురిసిన వర్షాలకు కాలనీల్లో కొంత వరద నీరు చేరిందన్నారు. ఆలస్యంగా కొనసాగుతున్న డ్రెయిన్ పనుల్లో వేగం పెంచి త్వరగా ముగించేటట్టు చర్యలు చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు. వరదనీటి కాలువ నిర్మాణ పనుల కొనసాగింపు క్రమంలో స్థానిక నాయకులు పనులు కొనసాగకుండా కాలాడ్డుతూ, అధికారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆగ్రహించారు. ఇలాంటి వారి మూలంగా పనులు కొనసాగింపులో ఆలస్యమైతే కాలనీలు వర్షాల కారణంగా ముంపునకు గురి కాక తప్పదన్నారు. ఇందుకు ప్రజలు తనను తప్పుపట్టేట్లు చేసేందుకే స్థానిక నాయకులు ఇలాంటి నీచ ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక నాయకులు ఇలాంటి ధోరణిని మార్చుకోవడం మంచిదని వారికి ఎమ్మెల్యే చురకలంటించారు. ఎగువన ఉండే వెంకటరమణ కాలనీ మీదుగా హస్తినాపురం, సాగర్ ఎన్‌క్లేవ్ వద్ద కొచ్చి వరదనీరు నిలవడం, వెంకటరమణ కాలనీ నుంచి సాగర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ నుంచి వచ్చే వరదనీటినీ వెంకటరమణ కాలనీ గుండా సాగర్ రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద ఉండే ట్రంక్ లేన్‌లో కలపడం జరుగుతుందని తెలిపారు. ఈ పనులు సకాలంలో పూర్తయితే నియోజకవర్గం పరిధిలోని వరదనీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తున్నదని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి కొరకు చేపట్టే పనుల్లో ఎవ్వరైనా అధికారులను ఇబ్బందులకు గురిచేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు చేపట్టక తప్పదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణయ్య, కార్తీక్, హేము నాయక్, కిరణ్, రఫీ, హస్తినాపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యంచారి, నాయకులు శ్రీనివాస్ నాయక్, రోహిత్‌రెడ్డి, ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం

రోడ్ల పై నిల్చిన వరద నీరు.. రోడ్లకు అడ్డంగా విరిగిపడిన చెట్లు.. జేసీబీ సహాయంతో సహాయక చర్యలు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది

వరద నీరు నిల్చిపోయిన చోట మున్సిపల్ సిబ్బందితో దగ్గర ఉండి పనులు చేయిస్తున్న వంకాయల యాదగిరి

బడంగ్‌పేట, జూన్ 13: మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహేశ్వరం మండలం, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో భారీ వర్షం కురిసింది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద నీరు ఎటు పోక పోవడంతో ఎక్కడికి అక్కడ వాహనాలు నిల్చిపోయాయి. బడంగ్‌పేట కమిషనర్ రఘు కుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి దగ్గర ఉండి వర్షంలోనే జేసీబీల సహాయంతో కాల్వలు తీయించారు. డివైడర్‌ను తొలగించి వరద నీరు పోయే విధంగా ఏర్పాటు చేశారు. వివిధ కాలనీలలో రోడ్లకు అడ్డంగా కూలిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. చాలా చోట్ల వరద నీరు నిల్చిపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిన చెట్టును జేసీబీ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, జూన్ 13: సిరీస్, ఎల్బీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ కేకే రామకృష్ణ తెలిపారు. సిరీస్ ఫీడర్ పరిధిలో ఉ||11గంటల నుంచి మ|| మూడు గంటల వరకు సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సూర్యోదయ కాలనీ, సరస్వతీనగర్, మధురానగర్, హకీమాబాద్ కాలనీ పరిసర ప్రాంతాలు, ఎల్బీనగర్ ఫీడర్ పరిధిలో సరస్వతీనగర్, చింతలకుంట, సూర్యోదయ కాలనీ పరిసర ప్రాంతాలు.

కళాకారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్

కందుకూరు, జూన్ 13: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కళాకారులను ఆదుకోవాలని కళాకారుల సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్ కోరారు. తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమ సమయంలో కాలికి గజ్జ కట్టి గోషి గొంగడి వేసుకొని గ్రామాల్లో తిరిగి గొంతెత్తి ధూంధాంలు లాడిన ఆట గొంతులు మూగపోయాయని గుర్తుచేశారు. గ్రామీణ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే తమను గుర్తించి ఇంటి స్థలంతో పాటు ప్రభుత్వ ఉద్యోగమిచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో ప్రభుత్వంపై పోటారం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాకారులు దన్నారం జంగన్న, శివ కుమార్, కిరణ్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

ముగిసిన రాధక్క అంత్యక్రియలు

సైదాబాద్, జూన్ 13: గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట ఉద్యమంలో కీలక భూమిక పోషించిన విప్లవోద్యమ నాయకురాలు రాధక్క(86) అంత్యక్రియలు గురువారం సైదాబాద్ దోభీఘాట్ శ్మశాన వాటికలో జరిగాయి. రాధక్క పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు రాయల్ చంద్రశేఖర్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమాక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, కవి జయరాజ్, ఝాన్సీ, యూ.వెంకటేశ్వరరావు, భూతం వీరన్న, చెరుకు సుధాకర్, ప్రసాద్, సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా సభ్యులు ఎం.బాలు నాయక్, సీపీఎం జిల్లా నాయకులు కిషోర్, యాదగిరి, ఇందిరా, అశోక్, చంద్రశేఖర్, యాదగిరి పాల్గొని నివాళులర్పించారు. రెండు రోజులుగా రాధక్క చికిత్స పొందుతూ మృతి చెందారు. అనంతరం, పార్థివదేహాన్ని సైదాబాద్ సింగరేణి కాలనీలోని ఆమె నివాసం వద్ద సందర్శనార్థం ఉంచారు.

విద్యాసమాచారం

బీఏఎస్ఎల్పీ రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్పీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఏఎస్ఎల్పీ మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 20లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

18 నుంచి సెల్ట్ తరగతులు

ఓయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 18నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం అయిదున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్లు 97035 89689, 79899 03001.

బీ ఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్షా తేదీలు

ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ కోర్సులు రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివిధ కోర్సులకు దరఖాస్తులు

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నిషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నం. 83090 37134, 63058 958 67లలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి

కందుకూరు, జూన్ 13: విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని ఎంపీపీ మంద జ్యోతి పాండు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దుస్తులు, నోటు, పాఠ్య పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. బడి ఈడు పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. విద్యలో విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. మధ్యాహ్న భోజనంతో పాటు ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో రాధక్క పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సంధ్య, జయరాజ్ తదితరులు

కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మంత్రి బండి సంజయ్ కుమార్ పలువురు బీజేపీ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, బీజేపీ ముసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, సీనియర్ నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, రాంకోటేశ్వర్ రావు, నవీన్‌రెడ్డి ఢిల్లీలోని మంత్రి నివాసంలో కలిసి సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

– మలక్‌పేట, జూన్ 13;

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కందుకూరి రామకృష్ణానంద్‌ను అభినందిస్తున్న రాష్ట్ర నేతలు

సైదాబాద్, జూన్ 13: హైదరాబాద్ సౌత్ సర్కిల్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకు సంబంధించిన సమావేశం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో గురువారం జరిగింది. సర్కిల్ అధ్యక్షులు మీర్జా సమద్ బేగ్, జోన్ ఉపాధ్యక్షులుగా కందుకూరి రామకృష్ణానంద్, కార్యదర్శిగా ఎం.స్వామి గౌడ్, అదనపు కార్యదర్శిగా ఎం.తిరుపతి, కోశాధికారిగా సంతోష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కందుకూరి రామకృష్ణానంద్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా తమ 1104 యూనియన్ పనిచేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, ఇంకా పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి

ఆంధ్రాబ్యాంక్‌లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి తదితరులు.

సైదాబాద్, జూన్ 13: ఆంధ్రాబ్యాంక్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణరవీందర్ రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ, జల మండలి, విద్యుత్, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి ఆమె కాలనీలో గురువారం పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్థానికంగా విద్యుత్ వీధి దీపాలు సక్రమంగా వెలుగకపోవటం, తాగునీటి, మురుగునీటి, రోడ్లు, పుట్‌పాత్‌లు, పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా కొనసాగకపోవటంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను తన దృష్టికి తెచ్చారని అన్నారు. కాలనీవాసుల సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని అయా శాఖ అధికారులకు సూచించారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన తిరుమల హిల్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులను ఆమె అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, విద్యుత్ ఏఈ వేణుగోపాల్, జల మండలి మేనేజర్ శ్రవణ్, శ్రీనువాస్, దుర్గా రావు, హార్టికల్చర్ మహేశ్, శానిటేషన్ జవాన్ నర్సింగరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త కాపు రవీందర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి శర్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కార్మిక నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్

ఆర్కేపురం, జూన్ 13: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ సమక్షంలో మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌కు చెందిన కార్మిక నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులు చేయాలని సూచించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ, సేవాదళ్‌ను బలోపేతం చేసేందుకు పాటుపడాలన్నారు.

సయ్యద్ ఇస్మాయిల్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జితేందర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మన్సూరాబాద్, జూన్ 13: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేరీతిలో నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్వాలిఫైడ్ టీచర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలు జరుగుతాయన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. మన్సూరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ ఇటీవల కూలిన విషయం ఇటీవలే తన దృష్టికి వచ్చిందని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, మునగాల హరీష్ రెడ్డి, నాంపల్లి మహేందర్, భీమనపల్లి సిద్ధు పాల్గొన్నారు.